రక్తస్పర్శ

[కథానిక]

శ్రీ బలివాడ కాంతారావు

రామావధాన్లు రామాయణం చదువుతున్నాడు. గ్రామంలోని కొందరు ప్రముఖులు, పాటక జనం, పిన్నా పిద్దా కడుశ్రద్ధతో వింటున్నారు. వీథి అరుగుమీద గొంతెత్తి గంభీరంగా చదువుతూ అర్థం చెప్తుంటే గదిలో కూర్చుని కాంతం వింటోంది.

రాత్రి తొమ్మిదిగంటల ప్యాసింజరులో దిగిన వెంకట్రావు అత్తవారింటికి కొత్తనూరంలో వుండగానే మామగారిగొంతుకవినిపించింది. యేదో పిరికితనం ఆవరించటంవలన వెనుకకుపోదామని తలచాడు కాని కాంతం తలపుకురాగా ముందుకుసాగాడు. అనుమానించినట్లే జరిగింది గలభా. అల్లుణ్ణి చూడగానే విరుచుకపడ్డాడు అవధాన్లు. అవధాన్లగారి సాత్త్వికమైన ప్రథమ కోపప్రవాహానికి అడ్డుగా ఆనకట్ట కట్టటం అసాధ్యం।

ఓర్పుతో ఆయనమాటలన్నీ కొన్నేపు విన్నాడు. తననేకాదు, గతించిన తనతండ్రిని కూడ దూషిస్తుంటే వెంకట్రావు సహించలేక కోపానికి లొంగిపోయి 'యిక మాటలు కట్టిపెట్టండి' అన్నాడు. 'వెధవలంతా కూడి నా కూతురు కడుపులో చిచ్చుపోశారు. మళ్లా యే ముఖం పెట్టుకొని వచ్చావ్ నా గుమ్మానికి? యెలా వచ్చావో అలాపో'—మామగారి జవాబుకు కంటకితుడై 'మీచే తిట్లుతినడానికి రాలేదు. మీ అమ్మాయి వ్రాసిన వుత్తరాలుచూసి వచ్చాను. యెన్నాళ్లు దాచుకుంటారో దాచుకోండి' అని అక్కడనుంచి వడిగానడిచి వచ్చిన దారినే పోయాడు. ఆ మాటలతో అవధాన్ల ముఖం పాలిపోయింది. దవడలు నొక్కుకుపోయాయ్. ఆ జనసమూహంలో ఆ కోపాగ్నిమధ్య వచ్చి భర్త పాదాలపై ఆ యౌవ్వని యెలా వ్రాలుతుంది? వెళ్లి పోవద్దని యెలా వారిస్తుంది? ఆమె కాధైర్యం లేక పోయింది. ఆమెహృదయాంతరాలలోని సమ్మెటపోట్ల బాధకు రాలిన కన్నీటి బొట్లు రక్తపు చుక్కలేమో!

అందరినీ ఆరోజుకు పంపించి గబగబ నిప్పు త్రొక్కిన కోతిలా గదిలో కాలుపెట్టి 'ఆ వెధవకు యెందుకు వుత్తరాలు వ్రాశావే? నా కడుపును కాల్చావే. నా పరువుప్రతిష్ఠలను గంగలో కలిపావే. నా మాటను బూటకం చేశావే—పో ముండా, నా యింట్లో వుండొద్దు' అని ఒక్కగుక్కలో కఠోరంగా అంటే కాంతం 'హా' అంటూ నిశ్చేష్టురాలైపోయింది. అప్రయత్నంగా చెవులు మూసుకుంది. అక్కడ నిలువలేక పోయింది. కాంతంతల్లి తల బాదుకుంది చాటుగా. అవధాన్లు గబగబ వీథి అరుగుమీదకు పోయి కూర్చున్నాడు.

కాంతం ఒక్కరితే చివరిగదిలో చీకటిలో కూర్చుంది. 'కాంతం! ముదురాకు గాలికి రెపరెపలాడి రాలిపోతే విచారించవలసిన పనిలేదుగాని లేత ఆకు రాలిపోతే కష్టంగానే వుంటుంది. నేను గండుకోయిలనై భక్షింపదలచుకోలేదు. వెళ్లిపో మీ నాన్నతో. త్రాగుబోతుకు పెళ్లాం యెందుకు? యీ తాగుడు రక్షించడానికి అబ్బ లేదు; ఆ శ్మశానానికి తీసుకపోటానికే'—భర్త పదినెలల క్రితం అన్నమాటలు జ్ఞప్తికివచ్చి శరీరం ఝల్లుమంది. యీ యింట్లో ఒక్క క్షణమైనా నిలవాలని లేదు.

మరల గలభా. తప్పత్రాగి చేతిలో పొడుగుపాటి వెదురుపుల్ల పట్టుకొని పేలుకుంటూవచ్చాడు...

దూషణలు మితిమీరుతున్నయ్. యీ గలాభాకు యిరుగుపొరుగువాళ్లు చుట్టుముట్టారు. కాంతం కళ్లు తడిసిపోతున్నా మరల భర్త వచ్చినందుకు యేదో ఆశాభావం మొలకెత్తుతోంది. పొరుగు కరణంగారు కలుగజేసుకొని అవధాన్లగారితో 'త్రాగినవాడిమీద కోపం చూపిస్తే యేం లాభమండీ? తెల్లారేక బుద్ధి వచ్చినట్లు నలుగురూ నాలుగు చీవాట్లు పెడదాం. పడుకోనివ్వండి' అంటూ పెరటివాసలోని చివరిగదిలో మంచం వేయించి బలవంతాన పడుకోబెట్టి నిద్రపోయే వరకూ వుండి వెళ్లిపోయారు.

ఇంచుమించు మూడుగంటల రాత్రయింది. రోజులా ఆ సమయానికే వెంకట్రావుకు తెలివివచ్చి కళ్లు తెరిచాడు. హరికేన్‌లాంతరు వెలుతురులో తన వేపు నీరునిండిన కళ్లతో చూస్తూ, చేతిలో విసనకర్రతో నిలుచున్న దేవతాస్వరూపిణి తన కంటికి గోచరించింది. కంటిరెప్పలు చెదిరాయ్. కంటిలో హెచ్చుగా నీరు అలముకుంది.

'కాంతం! నీ ఒళ్లు హూనంచేసినవాడిని ఆదరిస్తున్నావా? పిచ్చిదానవే.'

'.................'

'అమృతం దొరికింది. త్రాగి జీర్ణంచేసుకోలేని వాడిని' అంటూ లేచాడు. చక్కని కిశోరి కాంతం వ్యథితస్వరంతో 'నేను వుత్తరాలు వ్రాశానని నాన్న యెదురుగా యెందుకన్నారు? ఆయనకోపం మీకు తెలీదా?' అని ప్రశ్నించేసరికి 'హాఁ' అన్నాడు తప్పును తెలుసుకొని విచారించినట్లు. 'యీ ఒక్క రోజు త్రాగకుండా వుండలేకపోయారా?' మరల కాంతం పెదిమలు కదల్చగానే 'నా నొసటివ్రాతే' అని జబాబుచెప్పి తల దించాడు. త్రాగుడు మైకంలో యెంత హీనంగా ప్రవర్తించానో అనే ఆవేదన తలపుకు రావటంతో అక్కడ ఆగాలని లేదు. హీనస్వరంతో అన్నాడు: 'కాంతం! నీ వుత్తరాలన్నీ అందాయి. నీ బాగు నేచచ్చినా కోరతాను. నాదగ్గర వుండి యేం సుఖపడతావ్? యిక్కడేవుండు. వెళ్తాను' అని లేవబోయాడు. 'ఆగండి' అంది కాంతం, శాంత గంభీరస్వరంతో.

'నా మనసు హూనం చెయ్యలేదు. నే సుఖపడేది మీదగ్గరే.'

'సుఖం! నాలా త్రాగుబోతుమాటలే ఆడుతున్నావ్.'

'నేనూ త్రాగుతున్నాననే అనుకుంటున్నా. మీరు తప్పుచేస్తే ఒకటీ, నేనుచేస్తే వేరొకటీ కాదు. ఫలితం అనుభవించవలసినవారం యిద్దరమున్నా.'

'కాంతం! యీ వేదాంతం యెక్కడ నేర్చావే?'

'వేదాంతం నిజంకాదనా? త్రాగండి. కాని నీతిలేని కార్యం చెయ్యకండి. అదే మిమ్మల్ని కోరేది.'

'త్రాగడం ఒక నీతైన కార్యమే, పిచ్చిదానా' అంటూ భార్యను చేరదీశాడు. సుగుణవతి, సౌందర్యవతి యైన భార్యను ఆదరించని దౌర్భాగ్యజీవితం అయిందని యేడ్చుకున్నాడు.

తెల్లవారింది. తర్జనభర్జనలయ్యాయ్. 'నేను యిక త్రాగ'నని ఒట్టువేశాడు మామగారు, పెద్దల యెదుట. ఉన్న ఆస్తి కూతురుపేర వ్రాయనిది పంపించనని అవధాన్లు పట్టుపట్టాడు. వెంకట్రావ్ ఓక్కమొగం పెట్టాడు. మళ్లా గద్దించారు అవధాన్లు. 'క్షమించండి. ఆ పని చెయలేను' అని అల్లుడు అనగానే 'అయితే నే పంపించ'నన్నాడు.

తనమాట వినకుండా భర్తతో వెళ్లిపోటానికే సంసిద్ధంగావటంవలన ఆ.కూతురు మొగము యిక చూడనని అవధాన్లు ఒట్టువేసుకున్నాడు. కాంతం, వెంకట్రావూ రైలెక్కారు.

౨

కాంతం యింట్లో కాలుపెట్టింది. సామానులు చిందరవందరగా చెదిరివున్నయ్. వంటయిల్లు పట్లతో నిండివుంది. భర్తవేపు చెక్కిళ్ళపై చేయివేసి ఆశ్చర్యంతో—'యీ పదినెలలు భోజనం?' యీ ప్రశ్నకు 'ఆఁ. లేదు' అని క్లుప్తంగా సమాధానం యిచ్చాడు. 'నన్నెందుకు బలవంతంచేసి పంపించారు నాన్నతో. నెలరోజులలో పిలుచుకు వస్తాననీ, వంటచేసుకుంటా

వనీ చెప్పి మాట నిలుపుకోలే దేమండీ?' మనసును కలచే గొంతుతో అన్న అర్ధాంగిదగ్గరగావచ్చి 'ఆ త్రాగుడు దెయ్యం నమిలివేస్తుంటే యింకేం వంట చేస్తానే. చీకటిపడకుండా నే వెళ్లి సామానులు తెస్తాను' అంటూ వీధిలోకి బయలు దేరాడు.

రాత్రి భోజనంచేస్తూ, 'యెంతకాలం యిలా తృప్తిగా నీచేతి పాకం తినాలని దేవుడు వ్రాశాడో. కాంతం! త్రాగుబోతు బాగుపడతాడని యెలా అనుకుంటాం!

'మీ పుణ్యాం వుంటుంది. అలాంటి కష్టమైన మాటలాడకండీ. కాలం యెప్పుడూ ఒక్కలా వుంటుందా?'

'నా విషయంలో రోజులుమారవు. నా వేషం, నా వాటం చూస్తున్నావుగా. పిల్లలను పెంచటం తెలియనివాళ్లు కనటం, మానటం మంచిదికదా' అంటూ భార్యముఖంకేసి ఒకసారిచూచి 'నాన్న గతించారు. లోకం అంటుంది 'యేంలోటుచేశాడు, బాగా ఆర్జించి చచ్చా'డని, అటువంటి దిట్టకడుపున యిటువంటి త్రాగుబోతు వెధవ పుట్టాడని. ఏంటో యీ ప్రపంచం? పరులకబ్బు దోచేవాళ్ళు కొండను త్రవ్వి ఎలికనుపట్టిస్తారు. ఆ ఎలుక కాటు అనుభవించేది మనంగా'— మళ్ళీ పొడినవ్వు నవ్వి 'మాటలాడవేం కాంతం? నీ కన్యాయంచేసింది ఆ తండ్రిగారే. మీ నాన్న కళ్ళు కప్పి తాగుబోతుకు అంటగట్టాడు. మీ నాన్న తిట్టాడంటే తప్పులేదు!'

'గతించిన గడ్డురోజులు మరచిపోండి. శాంతసహనాలు, నీతి నియమాలకు కట్టుబడివుంటే పెద్దలు చేసిన తప్పులకు ఫలితం మనం యెందుకు అనుభవిస్తాం? సుఖదుఃఖాలు మన మనస్సును బట్టి వుంటాయ్. యికనైనా...' నిర్వికారమైన మనసుతో అన్న భార్య మాటలకు విస్మితుడై 'కాంతం! నీ మాటలలో యెంతో వ్యత్యాసం కనిపిస్తోంది. మీ నాన్న చదివే పురాణాలు వింటూ కూర్చునేదానవేమో? చదివేవాళ్ళు శాంతం అలవరచుకోపోయినా నీవు అలవరచుకుంటే నే లేకపోయినా గట్టెక్కిపోతావ్.'

'మీ రలా అధైర్యమైన మాటలు ఆడుతుంటే నా హృదయం వేగిపోతోందండి' భార్య కాస్త చలించి అన్నమాటలకు మారుమాటాడకుండా వూరుకున్నాడు.

పదిగంటలరాత్రి. శరీరమంతా పీకేస్తోందన్నాడు. బాధతో నలిగిపోతున్నట్లున్నాడు. కాంతం మంచందగ్గర నిలబడి విసనకర్రతో విసురుతోంది. 'ఉష్' అంటున్నాడు అప్పుడప్పుడూ. డాక్టరుని పిలుచుకువస్తానని కాంతం అంటే 'నా జబ్బుకు యీ ప్రపంచంలో దొరికేది ఒక్కటే మందు. ఆ మందే చివరకు నన్ను చంపుతుంది' తడబడుతూ అన్న భర్తమాటలలోని వ్యంగ్యాన్ని అర్థంచేసుకున్న కాంతం చేతిలో విసనకర్ర జారిపోయింది, తన కళ్ళతో ఆ బాధను చూడలేక 'యింతరాత్రప్పుడెలాగండీ? అంది.' 'పండ్రెండు వరకూ రోడ్డుమీద ఆ కొట్లో ఆ వెధవ మేలుకొనే వుంటాడే. యిలా భరిస్తేభస్తానుగాని త్రాగనే కాంతం. పెద్దలందరియెదుటా ప్రమాణంచేశాను.' కొంతసేపయాక గబగబా మంచందిగి 'కాంతం! నన్నెవరైనా ఖైదులో పెట్టిస్తే యీ బాధ యేంచేసేదో. పాడవటానికి స్వతంత్రంవుంది. వేగంగా వస్తాను. నే నిద్రపోయేవరకూ నా కంట పడక' అని గుమ్మందాటాడు.

గంటలో త్రాగి పేలుకుంటూ వచ్చాడు. 'కాంతం! రా. వస్తావా, లేదా? దాగుంటావే. నీ మొగుడ్నే నేను' అని యిలా మంచందగ్గర నిలబడి గొడవచేస్తున్నా కాంతం యెదురుపడలేదు. వడిగా పెరటిగదిలోనికి నడిచి తిట్లతో సహా పెళ్లాన్ని యీడ్చుకొచ్చాడు. రెండు తగిలించి యేమో యేమో వాగాడు. ఆమెమాత్రం పళ్ళు బిగబట్టుకొని అమాయకపు చూపులతో వూరుకుంది. వాగివాగి చివరకు నిద్రపోయాడు. మామూలుగా మూడుగంటలకి తెలివి వచ్చింది. భార్య అలా చేతిలో విసనకర్రతో పుత్తడి బొమ్మలా నిలుచుంది. వెంకట్రావుయొక్క అప్పటి అసలు హృదయంలో వర్ణించలేని అభిమానం, ఆవేదనలకులోనై మోహం సిగ్గుతోనూ, పశ్చాత్తాపంతోనూ కూడుకపోయింది.

కాంతం మాట్లాడదు. ఆమెయొక్క గంభీరమైన ముఖకాంతిలో జాలికూడ మిళితమైవుంది.

చిత్తస్థైర్యంలో పురుషునకు స్త్రీ తీసిపోదు. స్త్రీది సాధారణంగా జాలిగుండె అవటంవలన వేగంగా కళ్లలో నీరు తిప్పివేయగలుగుతుంది. మనసునే శత్రువుగా చేసుకున్న భర్త అభిమానంగా 'యిప్పుడు బాధ నయమైందా' అని ప్రశ్నించింది. కంపించే గొంతుతో 'హెచ్చుదా కాంతం?' అంటూ కళ్ళలో నీరు తిప్పాడు. భార్యను చేరదీసి 'నీ మనసును రంజింపజేయని వాడిపై నీ కెందుకే అంత అభిమానం ? నా చే యిలా దెబ్బలుతిని బ్రతకలేవు. రేపే దిగపెట్తా. మీవాళ్ళ యింటికి వెళ్లిపో' అన్నాడు. యీ మాటలు ఆమెను భరింపరానివిగా తోచి భర్తవక్షానికి ఆనుకొని వున్న ఆమె ఒకసారి నీరునిండిన కళ్లతో భర్తకళ్లల్లోనికి చూచింది. ఆ చూపులలోని అర్థం ఆయనమనసును కలచివేసి 'కాంతం! రేపటినుంచీ త్రాగనంటే త్రాగనే. క్షమించు' అంటూ ఆమెచేతితో తన చేతిని కలిపాడు.

3

గడియారంలోని చిన్న ముల్లు అరవై సాగ్గ పంద్రెండంకె మీదికి వచ్చింది. యీ గతించిన కాలంలో వెంకట్రావు యథాతథంగానే త్రాగుతున్నాడు. రాత్రి భార్యమీద త్రాగుడుమైకంలో కార్పణ్యం చూపిస్తూనే వున్నాడు. తరువాత యేడుస్తూ క్షమాపణలను కోరుతూ వచ్చాడు.

ఒకనాడు—'కాంతం! వూరికి కాస్తదూరంగా హాయిగా బ్రతుకుదామని యీ పెద్దయిల్లు కట్టించుకున్నాడు. ఒక ముసలమ్మ నమ్మి కేసుల్లో పెద్దరికం యిస్తే సగం ఆస్తి దోచాడట. యీ యింట్లో దిగిన రెండు నెలలకే అమ్మ గతించింది. మాఅమ్మశాపాలు వూరకనే పోతాయా? ముద్దుగా ఒక్క కొడుకని పట్నంలో చదువుకుంటున్న వాడిచేతిలో వందలు పెత్తే వాడికి పాడుబుద్ధు లబ్బకపోతే యింకేం అబ్బుతాయి చెప్పు' కాంతం యీ మాటలు విని వూరుకుంది.

ఒకరోజు పట్నం పనిమీద వెళ్తున్నాననీ, రేపు సాయంత్రం తిరిగి వచ్చేస్తాననీ, వెంగపెట్టుకోవద్దనీ కాంతం వద్దకు కబురుపెట్టి వెళ్లిపోయాడు. కాంతం ఒక్కరితే ఆయింట్లో అలా కాచుకుని కూర్చుంది. నిముషం ఒకయుగంలా చూచుకొని. మరుచటిరోజు రాత్రి పదిగంటలకు త్రాగివచ్చి 'సాని, రంగసాని, లలితా దేవట! ఛీ ముండా. నీముఖం చూడకూడదు. యెందరి మీద యిలా. యివిగో వందలు తీసుకో. నన్నొదిలి వెయ్. నా కాంతం నాకు పెళ్లాం. మళ్లీ అలా పిలిచి మీదపడ్డావంటే నిన్నేం చేస్తానో చూడు. వీడు వెంకట్రావ్. సుబ్బన్న పంతులు ముద్దుకొడుకు. హాఁహాఁహాఁ... ఛీ దెయ్యం, భూతం—బాబో నన్నుముట్టకు' అని పరుగెత్తి పరుపుమీద పడి గట్టిగా తలగడను కౌగలించుకొని కళ్లుమూశాడు.

మూడుగంటలకి తెలివివచ్చాక బొటబొట కన్నీరు కార్చివేస్తున్నాడు. కాంతంశరీరం పులకరించింది. భార్యముఖం చూడటానికి ఆవేదనతో కూడిన సిగ్గుతో కూడుకపోయాడు. 'యెవరండీ ఆ రంగసాని?' దిగజారిన స్వరంతో భార్య ప్రశ్నించేసరికి 'యిలాంటి చండాలుణ్ని బ్రతికి యేం చేయమన్నావ్?' అంటూ భార్య రెండుచేతులూ పట్టుకొని యేకధారగా కన్నీటిని ప్రవహింపజేశాడు. 'కాంతం! క్షమించు. యీచీకటి కొట్లో ఒక్కర్తెను విడిచిపెట్టాను. నాన్నకు అబ్బనిది నాకు అబ్బింది. రామినాయుడు పట్నంలో త్రాగించి సానింటికి తీసుకుపోయాడు. నిన్ను మంచి పోలేనే. నాగుండెల్లో దేవతవై కూర్చున్నావ్. దేవుడిచ్చిన ప్రేమని యీ లోకంలో ఒకే ఒకస్త్రీకి అర్పించుకున్నా. ఆమే నాకు సర్వస్వం.' అంటూ ఆమెను గాఢంగా కౌగిలించుకున్నాడు.

ఒక నాటి రాత్రి భోజనం దగ్గర భాగహారుల మీద కోపంతో అన్నాడు: 'యీ భాగహారులు భాగాన్ని హరిస్తే యే పూచీ లేదుగాని, మనుషులనే హరించేస్తారే. మనం యేదో బ్రతుకుతున్నాం. పైవాళ్లకన్నా వీళ్లే మనమీద విరుచుకపడడం హెచ్చుగా వుంది. కాంతం! నీవులేని పదినెలలూ పది యుగాలే. యెన్ని అసందర్భపుపనులో చేశాను. త్రాగివుంటే యీ వెధవలు వేలు దోచారు. అయినా ఆబంగారం, ఆడబ్బు దోచివేయుంది నాకు శాంతి...!' కాంతం హఠాత్తుగా అడ్డి 'వాళ్లలా అరుచుకోనీయండి. మనం ఒకరిని దూషించకుండాపోతే మనకెవరూ యేం చేయలేరు దోచివేయటం నీతిలేని కార్యం. యిలా అనకోవడం కూడా తప్పు. మీపుణ్యం వుంటుంది. అలాంటి పాడుపని చేయకండి. యెలా ఆర్జించిన ఆస్తి అలా పోనీయండి. అప్పుడైనా కష్టపడి సుఖంగా బ్రతుకుదాం'

భార్యవేపు ఒకసారిచూస్తూ 'చాలాహాయిగా బ్రతికి సుఖానికి లొంగిపోయిన యీ రెముకలపోగు

కష్టపడి పనిచేస్తుందా? అంతా పిచ్చిభ్రమ. దేవుడేం ప్రాశాడో? యిలా నడనీ. యెంతకాలమో?' అన్న వెంకట్రావు మొగములో దురాలోచన-చిహ్నాలు తాండవించటం చూసిన కాంతం 'నన్ను పిచ్చిదాన్ని చేస్తున్నారు మీమాటలతో. మీరు దొంగతనం చేస్తే నేనూ మీతో జైలుకు వస్తాను. మీ యీ చెడ్డ అలవాట్లను తప్పించని దేవతను మీరుచేసే పాపానికి కూడ బాధ్యురాలను. ఒకరిదెబ్బ మనకు మరివద్దు. యిప్పుడు అనభవించింది చాలు' అని దీనంగా బ్రతిమాలే భార్యవేపు యెగాదిగా ఒకసారి చూసి మౌనాన్ని దాల్చాడు.

కాలగర్భంలో మరి రెండు నెలలు కాంతం జీవితంలో యెదుటివారి కంటికి విషాదాంతంగానే కనుపించి మునిగిపోయాయి. ఇప్పుడు వెంకట్రావు పరిస్థితి కాస్త హీనంగానేవుంది. కాంతం యెన్నో విధాల ఆయనమనసు కష్టపెట్టకుండా సంసారం సాగించటానికీ, త్రాగుడు మాన్పించటానికీ ప్రయత్నించింది. కాని, అవి ప్రయోజన శూన్యాలని ఆమె గుర్తించుకో గలిగింది. ఒంటిగా కూర్చుని భావిని తలచుకొని రెండేరెండు కన్నీటి బిందువులురాల్చేది. మరల సంబాళించుకొని ప్రస్తుతకర్తవ్య మేమిటని ఆలోచించుకొని కూర్చునేది. ఉన్న పాపపు ఆస్తి పైసలా అయిపోతే అప్పుడు జ్ఞానోదయం కావచ్చునని ఒక వెర్రి ఆశతో వూగులాడేది.

'కాంతం! ఆ రోజు మీనాన్న అంత బలవంతంచేస్తే ఆస్తి నీపేర యెంచేత రాయలేదంటావ్. యేముందనే. ఉన్న కాస్త కడుపుకొట్టినదీ నీపేర వ్రాసి నీ పవిత్రమైన జీవితానికి కళంకం తెస్తానా? కాకులనుకొట్టి గద్దలకు వేసేరకం అయింది యీ వంశం. నాతో సరిలే. యింకెన్నాళ్లు యీ పాపపుకూడు' అన్నాడు ఒకనాడు. ఇప్పుడు భర్తను యేమన్నా కాస్త చిరాకుపడతారని ఒకసారి అశ్రుపూరిత నేత్రాలతో భర్త కళ్లలోకి చూచి తల దించుతుంది. యీ ఘటన ఆయనమనసును కలచివేసి పరిపరివిధాలుగా తీసుకొని చెప్పరానిబాధ పడతాడు. ఒంటరిగా కూర్చున్నప్పుడు దేవుణ్ని దూషిస్తాడు. 'యిటువంటి నవమోహనాంగిణి, సుగుణవతిని తనలాంటి త్రాగుబోతుకు అప్పచెప్పి నాటకంచూచి ఆనందిస్తున్నాడని. మళ్లా తెలివితెచ్చుకొని, పెళ్లి యెందుకు చేసుకున్నానని తననుతనే దూషించుకుంటాడు.

ఒకనాటిరాత్రిభార్య తలను తన తలతో ఆన్చి దీర్ఘనిశ్వాసాలు తీస్తూ యేదో చెప్పబోయాడు. కాని గొంతుక పట్టుకుంది. మళ్లా సవరించుకొని 'కాంతం!' అని వూరుకున్నాడు. మరల సంబాళించుకొని అన్నాడు. 'కాంతం! జన్మజన్మాలకు నా భార్యగానే జన్మిస్తానని నా చేతిలో చేయి వేయ్' అన్నాడు ఆవేదనతో కూడిన స్వరంతో. ఆమె అభిమానంగా ఆయనచేతిలో చేయి వేసింది. మరల అన్నాడు—'యీ జన్మ యిలా కాలిందిలే. వచ్చేజన్మలో మొదటినుంచి జాగ్రత్తగా......కాంతం!!'

రెండుపక్షాల తరువాత విషయం: కాంతం అంది భోజనం చేస్తున్న భర్తతో—'అన్నీ అమ్మండి. కాదనను. కాని యింటినిమాత్రం మిగల్చండి. లోకం యెగతాళి చేస్తుంది ఇల్లూ వాకిలీకూడా అమ్మివేశారని. తలదాచుకోడానికి యిల్లంటూ వుంటే పస్తున్నా ఫరవాలేదు'—ఒక్క-పాడినవ్వు నవ్వి వూరుకున్నాడు. భార్యవేపు తీవ్రకరుణాదృష్టులను ప్రసరించి వూహాలోకంలో వురిత్రాళ్లయెదుట నిలుచుంటాడు కర్తవ్యమేమి టని. కొన్నాళ్లలో యెటువంటి దారుణపరిస్థితులు వస్తయోయని పెద్దపెట్టున లోలోన యేడ్చుకుంటాడు. భార్య చెప్పిన బోధనలు విని 'ఇదీ నా ప్రపంచం' అని లేచిపోతాడు ఒకసారి. 'మంచిచెడ్డలు పాలు-నీరులాంటివి. మంచిలో చెడుగు కలిసిపోయి చెడుగు మంచిఅయిపోతుంది. కాని, నేను మాత్రం నీలో కలిసిపోలేకపోతున్నా. అలాంటిదినే నెందుకు బ్రతకాలి?' అంటాడు నిమ్మళంగా యింకొకసారి. భార్యమాటలు, సేవ ఆయనహృదయాన్ని మధుసిక్తం చేసేవికాని అంతలో యేదో హాలాహలం గొంతులోనూ, బుర్రలోనూ మండిపోయేది.

౪

వారంరోజులనుంచి మనిషి పిచ్చివాడిలా వున్నాడు. కాని భార్య యేమనుకుంటుందో అని పాడినవ్వులు నవ్వకపోలేదు. మనిషిని ఒంటరిగా చూస్తే వుద్వేగంతోనూ, సంశయంతోనూ బాధపడుతున్నట్లు గుర్తించవచ్చు.

'ఈవేళ అమావాస్య' అన్నాడు రాట్నం త్రిప్పుతున్న పెళ్లాంతో వెఱ్ఱినవ్వుని పెదిమలపై ప్రసరించి. 'పాపం! నీ కెందుకే కాంతం, యింత కష్టం.

సుఖపడటానికి అవకాశం వుండగా నువ్విలా......' కాంతం జవాబుకు నిరీక్షించకుండా 'యీ ఒక్క రాత్రైనా ఆనందంగా గడుపుమా. నే చచ్చినట్లు ఈ రాత్రి తాగితే'. కాంతం చప్పున లేచి 'మీరు నన్ను మీ ఒట్లతో రోజూ పిచ్చిదాన్ని చేస్తున్నారు. అబ్బా బ్రతకలేనేమోనండీ' కాస్త చిరాకును వ్యక్తపరుస్తూ అంది. 'ఆగు కాంతం! నేను చెడుగు మాట్లాడంలే. పట్నంలో చాలా మంచిసినీమా అవుతోంది. రెండు బళ్ల మీద వూళ్లో చాలామంది ఆడవాళ్లు వెళ్తున్నారు. నీవుకూడ వస్తావని చెప్పాను. తప్పకుండా వెళ్లాలి.'

వెళ్ల నన్న కాంతాన్ని బ్రతిమాలుతూ యెన్నో విధాలుగా చెప్పాడు. దొంగలు రాకుండా యింటిలో తను వుంటానని చెప్పాడు. భర్తచే అంతగా బ్రతిమాలించుకోవటం ఆమెకు భరింపరానిదిగా తోచింది. రోడ్డుమీద బండివెనకాల కొంతదూరం నడిచాడు. 'తిరిగివచ్చేటప్పటికి తెల్లాగుతుంది. మరేమీ భయపడకు. అందరూ వున్నారుగా' అని వెనుకకు వచ్చాడు.

ఒంటరిగా పెరటివరాండాలో కూర్చొని ఆకాశం వేపు చూస్తూ వూహలతో బుర్రను పనిచేయిస్తున్నాడు. తనలో తనే నవ్వుకుంటున్నాడు. మళ్లీ యేదో భారాన్ని మోయలేనివాడుగా గాబరింప పడుతున్నాడు. పెరటనున్న వేప చెట్టునుంచి గాలికి పండుటాకులు రాలుతున్నాయ్. 'ఇదీ నా ప్రపంచం' అన్నాడొకసారి నూలుగుతూ. లేచి జేబులోనున్న వూట కలం వేపు చూస్తూ 'నాన్న చేతిలోవుండి దోచే ప్రపంచానికి సాయం చేశావ్. ఇప్పుడు యేం చేయబోతున్నావో!' అని వెకిలినవ్వు నవ్వి లోనికి పోయి మంచం మీద చేరబడ్డాడు.

గోడగడియారం మనుషుల మనస్తత్వాలతో నాకు సంబంధం లేదన్నట్లు పదిగంటలు చూపించి టంగ్ టంగ్ మంటోంది—హరికేన్ లాంతరు వెలుతురులో వుత్తరం వ్రాసుకుంటున్న వెంకట్రావ్ ఒక్కసారి గడియారం వేపు చూసి నిట్టూర్పు విడిచాడు. యజమాని యెవరైతేనేం కలంవిధి కష్టపడటం? వెంకట్రావ్ అని సంతకంచేసి 'నా వూహల్ని వ్యక్తపరిచేవ్ విశ్రాంతి తీసుకో' అని జేబులో పెట్టాడు.

లేచాడు ముందుకు నాలుగు అడుగులు—మళ్లా వెనుకకు. ఛీ అని చీదరించాడు. 'జీవితం' అంటూ ముందుకు. చివరకు చీకటిలో లీనమయ్యాడు. గంట లోపలే పని ముగించుకొని తిరిగి యింట్లో కాలు పెట్టాడు. పెట్టెలో ఒక మూట పెట్టాడు. శరీరం అంతా కంపిస్తోంది. గాఢంగా నిట్టూర్చుతున్నాడు. ఇప్పుడు తన మనసే రాబందైతే తననే పీక్కుతింటోంది. 'కాంతం, విడిచిపెట్టి యెలా వుండటం? విడిచిపెట్టక పోతే జీవితం!!'

గడియారం పన్రెండు కొట్టేవరకు సందేహం, వుద్వేగంతో కంటకితుడయ్యాడు. గబగబ నడిచాడు—హాయిగా వుండటానికి ఒకే ఒక సాధనం! 'ఒట్టులు యెన్ని వెయ్యలేదు. ఇదీ నా ప్రపంచం' అంటూనే.

'చూస్తావేం. పొయ్యి. తాగటానికి ఆఖరు రోజు. వేస్తావా, లేదా? యింద పదులు, పాతికలు. కళ్ళు పేలవ్...!' తప్ప తాగాడు. చేతిలో ఒక సీసాపట్టుకొని చీకటిలో లీనమయ్యాడు.

మాసాలుగా యించుమించు మూడుగంటల సమయానికి తెలివివచ్చింది. కళ్ళు విప్పాడు. విసనకర్రతో వెట్టిబాగులపిల్ల కనుపించలేదు. ఆకాశం చిన్న చిన్న మేఘాలతో. 'హాఁ, కాంతం' హృదయాంతరాళంలో ప్రతిధ్వనిస్తోంది. లేచాడు. అదిగో యేటికోన. ఇదిగో. యిది మర్రి ట్టూ—హాఁ, అవును. నే నెక్కడున్నా—బూడిదమీద—శ్మశానం! శ్మశానం!! శ్మశానం!!! అమ్మో—ఇవిగో భూతాలు—వందలు, వేలు—నా మీదపడకండి—వద్దు—వద్దు...హాఁ...

గట్టిగా కళ్ళు మూసుకొన్నా పిశాచాలు నృత్యం చేస్తున్నాయ్. అస్థిపంజరాలు ఆడుతున్నాయ్. భీకరంగా నినాదాలు చేస్తున్నాయ్. దవడలు ఆడిస్తూ మాంసంతో వున్న ఒకే ఒక యెముకలపోగుమీద వురుకుతున్నాయ్. గుండెను పీకుతున్నయ్. మాంసాన్ని ముక్కలుచేసి పంచుకొంటున్నాయ్. 'అమ్మో'—అని పెద్ద అరుపుతో నిర్విరామంగా పనిచేసే ఒకే ఒక అవయవం శాశ్వతవిరామంతో సంతృప్తి జెందింది. భూతాలను చూడలేక. భూతాలే యీ భౌతిక దేహాన్ని చూడగలిగితే నీతిలేని మని షని దూరంగా తప్పుకుంటాయ్!

తెల్లవారుతోంది. కోడికోడి కూసింది. వూరిలో గలాభా. మునసబు రిపోర్టు వ్రాసి అర్జంటుగా

పంపించాడు సైకిలుమీద ఒక మనిషిని. వూరికి కాస్త దూరంలో సినీమానుంచి తిరిగివస్తున్న వారికి ఆయన సైనం యెరుకపరచాడు. ముసలివాళ్లను యింట్లో పెట్టి సినీమా కెందుకొచ్చా మని వెంకట్రావ్ భాగహారులు నెత్తీ నోరూ మొత్తుకుంటున్నారు. కాంతం 'పోలీసులు వచ్చి దొంగలను పట్టుకుంటారు' అని ఓదారుస్తోంది ఆడవాళ్లని. ఓదార్చవాళ్లుంటే యేడుపుశ్రుతి హెచ్చుతుంది. కాంతంకూడ కన్నీరు తెచ్చుకొని 'యే వెధవలకు పుట్టిందో ఆ పాడు బుద్ధి. పాపానికి ఫలితం అనుభవిస్తా రత్తమ్మా' అని పరిపరివిధాల ఓదార్చింది.

కాంతం యింట్లో కాలుపెట్టింది. భర్తకోసం యిల్లంతా ఒక్కసారి గాలించింది. భర్తజాడ లేదుగాని, భర్త వ్రాసినజాబు టేబిలుమీద వుండగా తీసి యిలా—

'కాంతం! జన్మజన్మాలకు నా భార్యవుకదే. వ్రాయటానికి కూర్చున్నాగాని చేతిలోని కలం సిరాని కక్కుతోంది. నా జీవితం—నీ జీవితం—ఇదే నే నెన్నోసార్లు నీతో అన్న నా ప్రపంచం! నరక స్వర్గాలకు మధ్య నున్న తేడా!!

'నాలాంటి త్రాగుబోతుకు మంచీ చెడ్డా తెలుసుకొనే విచక్షణజ్ఞానం యెందుకు ప్రసాదించాడా వెర్రి దేవుడు? నాన్న నమ్మినవారిధనం దోచి చచ్చాడు. నేను నమ్మినవారి జీవితాన్నే దోచేస్తున్నానని భయంగా వుంది—రక్తస్పర్శ!!

'శరీరంఅంతా పీకెడుతోందని, బాధ తక్కువైనా చచ్చిపోతున్నట్లు నటించి త్రాగటానికి పరుగెత్తేవాడిని. మనసు కట్టుకోలేనివాడిని, మంచి చెప్పి ఆచరించలేనివాడిని త్రాగి నీ ఒళ్లెందుకు హూనం చెయ్యాలి? ఇదే నన్ను నలిపివేస్తున్న విషయం. నీ కున్న సంతృప్తి నా కెందుకు లేకపోవాలి? నీ కున్న గుండెధైర్యం నాకెందుకు దూరంగావాలి? ఇవన్నీ తలచుకుంటుంటే యీ జన్మలో నీకూ నాకూ పుస్తె ముడివలన సంబంధమే కానీ హృదయాలవలన కాదేమో?

'ముందుగానే వ్రాస్తున్నా. దోచాక మన సెలా వుంటుందో. నగలు, డబ్బు తెస్తాననే ధైర్యంగా వుంది. అది నా డబ్బే. కాని, లోకం నీవుకూడ దొంగడబ్బంటారు, నీతిలేని కార్యమంటారు. యింత డబ్బు త్రాగుడుక్రింద తగలేశాను. బీదలకు ఒక్క కానీ ధర్మం చెయ్యలేదు. యీ డబ్బు నీ కిచ్చినా నీవు పుచ్చుకోవని నా దృఢనమ్మకం. యీ దోచినడబ్బుతో యిల్లు వదలి పేదలకు పంచిపెట్టి జైలుకుపోతాను. విడిపించటానికి ప్రయత్నం చెయ్యకు. సంఘంపెట్టిన నియమాన్ని బట్టి నాతోనే నీసంబంధం కాబట్టి ప్రయత్నం చేస్తే నీకే నష్టం. జైలులోవుంటే ఆ మన సెలా కట్టుబడదో చూస్తాను. నా యీపనివలన రెండు లాభాలు—పుణ్యం; జీవితం చక్కబడటం. వందలు బదులుగా వేలు దోచటానికి వెళ్తున్నా. యెవరికీ దొరక ననే నా ధైర్యం.

'నీతో త్రాగ నన్నా. కానీ ఆఖరురోజు త్రాగాలని మనసుపోతోంది. త్రాగి తెలివి తెచ్చుకొని యెక్కడో నీవు వూహించలేని చోటుకు పోతాను. జైలు అధికారుల ధర్మమా అంటూ కష్టపడటం నేర్చుకుంటాను. అప్పుడే మన యిద్దరం క్షేమంగా కాలం గడపగల మని నా ఆశ.

'అదిగో గోడగడియారం పదికొట్తోంది. కలంలో సిరాకూడా ఆఖరు. నీ—

వెంకట్రావ్'

ఉత్తరం చేతిలోనుంచి జారిపోయింది. కళ్లల్లో నీరు తిరిగిందిగాని జారి క్రిందపడలేదు. అలా శిలాప్రతిమలా నిలుచుండిపోయింది. 'నీతిలేని కార్యం చెయ్యండి నిలవలేక పోయా రన్నమాట! దొంగలు రాకుండా యింటిని చూస్తానని దొంగతనానికివెళ్లారు! త్రాగనని ఒట్టువేసి మాట నిలుపుకోలేకపోయారు! దుర్బలు లయ్యారు. నాతో మీ అసలు మనసును చెప్తే నేనే స్తంభానికి త్రాళ్లతో కట్టి త్రాగుడు మానిపించివుందునే—హో జీవితం!' అనుకుంటూ ఆ ప్రతిమ పెద్ద వీధిగుండా కదులుతోంది. చూచేవారు ఆశ్చర్యపోతున్నారు. యీ ఘోషాస్త్రీ యిలా రావటంతో వీధిఅరుగుమీద కొందరు గ్రామపెద్దలతో కూర్చున్న మునసబుగారితో 'బాబూ 'దొంగలుదొరికారు. నాభర్త

దొంగతనం చేసి పరారయ్యారు. ఆయన శరీరంలో అర్ధ భాగాన్ని నేను. నన్ను దయచేసి జైలుకుపంపండి'— ఆమెమాటల్లో గంభీరత, నటనలో శాంతం గోచరిస్తోంది. అందరూ ఆమెవేపు జాలినిండిన కళ్లతో చూస్తున్నారు. పరుగెత్తుకొని వచ్చాడు కాంతంచిన్నమామ. 'మరెవరూ కాదండీ మునసబుగారూ! అదిగో ఆ త్రాగుబోతువెధవే. వెంకట్రావ్. ఇదిగో పెరటి ముళ్లపొదదగ్గర వాడి వూటకలం దొరికింది. వాడే, వాడే'. అని ఆత్రుతగా చెప్పుకపోతున్నాడు. కాంతం తల దించి అలా నిలుచునే వుంది. ఇంతలో యింకొకడు పరుగెత్తుక వచ్చి 'బాబూ! వెంకట్రావుగారు వల్ల కాడులో నచ్చిపడున్నారు. కాకులు, గద్దలు మూగుతున్నాయి'.

'హాఁ' అంది కాంతం. నీటితో నిండివున్న కళ్లనుంచి ప్రవాహం వుబికి ప్రవహించింది. అధిక దుఃఖం మానవులను పిచ్చివాళ్లగానైనా చేస్తుంది. లేదా గుండెనైనా ఆపుతుంది. ఆ దొంగతనానికి శిక్ష అనుభవించంది కాంతం చనిపోదేమో!

పోలీసులు వచ్చారు. ఇల్లంతా సోదాచేశారు. పెట్టెలో నగలు, డబ్బు దొరికింది. కాంతంకు వ్రాసిన ఉత్తరంకూడా దొరికింది. శవపంచాయితీకూడా జరిగింది. ఆమెమాట విన్నవారెవరు? ఆమె జైలుకు వస్తానంటుంటే కనికరం, కళ్లనీరూ అందరినీ చుట్టుముట్టింది. డోలీకట్టి శవపరీక్షకు పట్నం తీసుకపోతున్నారు వెంకట్రావ్ భౌతికశరీరాన్ని. 'నన్ను శిక్షించండి. ఆ దొంగతనం నే చేస్తే ఒకటి కాదు. నా భర్త చేస్తే వేరొకటి కాదు' అంటూ ఆమె వెనుక పరుగెత్త బోయింది. ఆడంగులు ఆమెను వారించి పట్టుకున్నారు.

వెళ్లిపోతున్న డోలీవేపు చూచి బిగ్గరగా నవ్వుతూ "హా హా హా దొంగ. నీతిలేని చావు. ఛీ ఛీ జన్మజన్మాలకు భర్త ఛీ ఛీ వద్దు వద్దు. చావటానికి జైలుకు పోవడానికి నీతిలేని పని ఛీ ఛీ వద్దు వద్దు హా హా హా..." తల విరగబోసుకుని నవ్వే ఆమెవేపు చూసి అందరూ కళ్లల్లో నీరు తెచ్చుకుంటున్నారు.

మాటాడితే 'పిచ్చిదానా' అని సంబోధించిన వెంకట్రావ్ పిచ్చిదాన్ని చూడలేకపోయాడు. దోచే ప్రపంచానికి సాయంచేసిన కలం దోచినవాడినే చూపించినందుకు దానిపైనుండిన ద్వేషాన్ని కాల్చుకో లేకపోయాడు.

సాయంత్రమయేసరికి వచ్చిన తండ్రివేపు చూచి— 'ముండ—హాఁ' అంటూ నిశ్చేష్టురాలైంది. అప్రయత్నంగా చెవులు మూసుకుంది. అక్కడ నిలువలేక యెక్కడికో పరుగెత్తిపోయింది. అవధాన్లు గోడకు చేరబడలేదు. యేడుస్తూ భార్యలా తల బాదుకుంటున్నాడు.